నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I హైదరాబాద్, మంగళవారం 23 జూలై 2024 SANGAREDDY

# మెరిసిన సిద్దిపేట స్టీల్ బ్యాంక్

- పార్లమెంట్ ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా బుక్‌లో సిద్దిపేట స్టీల్ బ్యాంక్ గురించి ప్రచురణ
- అధికారులు, ప్రజలకు అభినందనలు తెలిపిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేటలో స్టీల్ బ్యాంక్ ప్రారంభోత్సవంలో ప్లాస్టిక్ వాడమని ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే హరీశ్ రావు (ఫైల్)

సిద్దిపేట, జూలై 22: సిద్దిపేట పట్టణంలో ఏ కార్యక్రమం తలపెట్టినా జాతీయ స్థాయిలో స్ఫూర్తి నిస్తున్నదని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ప్లాస్టిక్‌ను నివారించాలనే ఆలోచనతో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు చేసిన వినూత్న ప్రయత్నమే స్టీల్ బ్యాంక్. ప్లాస్టిక్ రహిత పట్టణంగా సిద్దిపేటను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఆయన తీసుకున్న కార్యక్రమం వార్డు వార్డునా స్టీల్ బ్యాంక్. ఆయా వార్డుల్లో జరుగుతున్న శుభకార్యాలకు ప్లాస్టిక్ ప్లేట్స్, ప్లాస్టిక్ గ్లాసులు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు వాడకుండా ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో సిద్దిపేట పట్టణంలోని 34 వార్డుల్లో స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేయించారు. ప్రతి యేటా కేంద్రం వెలువరించే పార్లమెంట్ ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా బుక్‌లో 'ఇది అద్భుతమైన కార్యక్రమం ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ఇక్కడి పాలకులు స్టీల్ బ్యాంక్ కార్యక్రమం తీసుకురావడం అద్భుతం' అని అందులో మెచ్చుకున్నారు. సిద్దిపేట స్టీల్ బ్యాంక్ గొప్ప కార్యక్రమం..అద్భుతమని కొనియాడుతూ ఇదే స్ఫూర్తితో దేశం మొత్తంలో అమలుపరుస్తామని అందులో ప్రచురించారు.

### సిద్దిపేట ఖ్యాతిని జాతీయస్థాయిలో నిలుపడం గర్వకారణం



ఏదైనా ఒక పని మొదలు పెట్టినపుడు అవుతుందా కాదా అని ఆలోచనతో మొదలు పెడతాం.. కానీ సిద్దిపేట ప్రజల అదృష్టం ఇక్కడ ఏ కార్యక్రమం తలపెట్టినా ఫలితం ఇస్తున్నదనే నమ్మకం ఉంది. అమలు చేసిన అనేక కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. పార్లమెంట్ ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా బుక్‌లో సిద్దిపేట స్టీల్ బ్యాంక్ మంచి కార్యక్రమం అని ప్రచురించడం జాతీయస్థాయిలో మరో రికార్డు సిద్దిపేటకు రావడం చాలా గర్వంగా ఉన్నది. ఒక ప్రజా ప్రతినిధిగా పనిచేయ డం ఎంత గొప్పదో.. అది ప్రజలు సద్వినియోగం చేసుకొని ఫలితం రావడం గొప్ప సంతృప్తిని ఇస్తున్నది. సిద్దిపేట ఖ్యాతిని జాతీయస్థాయిలో నిలుపడంలో భాగస్వాములైన ప్రజలు, అధికారులకు అభినందనలు.. శుభాకాంక్షలు.

-మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



పార్లమెంట్ ఎకనామిక్ సర్వే ఇండియా బుక్‌లో సిద్దిపేట స్టీల్ ప్లాంట్ ప్రస్తావన



సిద్దిపేట పట్టణంలోని స్టీల్ బ్యాంక్



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జూలై 22 (నమస్తే తెలంగాణ) : సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రజలకు సూచించారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో ప్రజావాణి ద్వారా వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి నేరుగా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి చెప్పుకోవాలి కానీ, ఇతరుల మీద ఆధారపడరాదని సూచించారు.

వివిధ సమస్యలపై ప్రజలు పెట్టుకున్న136 అర్జీల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం 18, ధరణి భూ సమస్యలు 36, పింఛన్ల కోసం 8, రుణమాఫీ 7, ఇతర సమస్యలపై 67 దరఖాస్తులు వచ్చాయి.

### ముదిరాజ్‌లను బీసీ ఏకు మార్చాలి

ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని ముదిరాజ్ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు పుట్టి రాజు డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ప్రజావాణిలో భాగంగా ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలని కోరుతూ కలెక్టర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌లో భాగంగా ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీఏలోకి మారుస్తామని చెప్పారని గుర్తు చేశారు. ముదిరాజ్ కులస్తులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారన్నారు. ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలని కాసాని జ్ఞానేశ్వర్ గత 20 ఏండ్ల నుంచి పోరాటం చేస్తున్నారని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ముదిరాజ్‌లు వివక్షకు గురయ్యారని, సరైన ఉపాధి లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 2009లో దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముదిరాజ్‌లకు ప్రత్యేక జీవో తీసుకువచ్చినా అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్, జనరల్ సెక్రటరీ భిక్షపతి, సురేందర్, శేఖర్, అశ్విని, గణేశ్, బాల్‌చందర్, నాగరాజు, సందీప్, సంతోష్, నాగేశ్వర్ పాల్గొన్నారు.

### రుణమాఫీ కాలేదని వంద మంది రైతుల మొర

ప్రభుత్వం రూ.లక్షలోపు ఉన్న పంటరుణాలకు మాఫీ వర్తిస్తుందని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో సాంకేతిక కారణాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మెదక్ జిల్లా ర్యాలమడుగు గ్రామానికి చెందిన 100 మంది రైతులు పంటరుణమాఫీ కాలేదని మెదక్ కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు మొర పెట్టుకున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పంటరుణమాఫీ చేసినపుడు ఇండియన్ బ్యాంకులో సాంకేతిక కారణాల వల్ల అప్పుడు కాలేదని ఇప్పుడు తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం పంటరుణమాఫీ చేసినా అదే పరిస్థితి ఉందని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. పంటరుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రుణమాఫీ వర్తించేలా చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ విషయమై ఇండియన్ బ్యాంకు మేనేజర్‌ను వివరణ కోరగా.. బ్యాం క్‌లో టెక్నికల్ సమస్య వల్ల పంటరుణ మాఫీ కాలేదని, మరో ఐదారు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందన్నారు.



ప్రజావాణిలో కలెక్టర్‌తో మొరపెట్టుకుంటున్న ర్యాలమడుగు గ్రామరైతులు

## ప్రజావాణికి వెల్లువెత్తిన అర్జీలు

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 22: ప్రభుత్వం ప్రకటించిన పంట రుణమాఫీ కాలేదని 16 పీఏసీఎస్ సంఘాల నాయకులు అధికారులతో మొరపెట్టుకున్నారు. నందికంది పీఏసీఎస్ సంఘం అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణికి వచ్చిన రైతులు తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాదులను అందజేసి సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. ప్రజావాణిలో మొత్తం 55 అర్జీలు అందాయి. ఇందులో రెవెన్యూశాఖకు సంబంధించి 33 అర్జీలు రాగా మిగతా 22 వివిధ శాఖలకు సంబంధించి ఉన్నాయి. ఆయా దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురీలతో కలిసి స్వీకరించిన కలెక్టర్ వాటిని సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మజారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

ప్రజావాణి అధికారులను ఉద్దేశించి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా సమయపాలన పాటించాలన్నారు. జిల్లా అధికారులు కింది స్థాయి ఉద్యోగులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజావాణి అనంతరం అధికారులతో వర్షాలపై కలెక్టర్ సమీక్షించారు. మూ డు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు రోడ్లు గుంతలు పడి ప్రమాదకరంగా మారాయన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లా లక్ష్యం 35, 88,000 కాగా, ఇప్పటి వరకు 45 శాతం పూర్తయిందన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### నాకు రుణమాఫీ కాలేదు



తొగుట, జూలై 22: నాకు రెండు ఎకరాల భూమి ఉన్నది. 2023 అక్టోబర్ 7న రూ.80 వేల పంట రుణం తీసుకున్నా. ప్రభుత్వం విడుదల చేసిన పంటరుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. పంటరుణ మాఫీ అవుతుందని ఎంతగానో ఎదురు చూశా. సీఎం రేవంత్‌రెడ్డి మాలాంటి రైతులను మోసం చేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన రైతులకు కూడా సగం మాత్రమే పంటరుణమాఫీ చేసింది. రూ.లక్ష పంట రుణ మాఫీ చేశామని ప్రభుత్వం చెబుతున్నా అది ఎక్కడా అమలు కావడం లేదు.

—బి.నాగరాజు, వెంకట్రావుపేట గ్రామం, తొగుట మండలం, సిద్దిపేట జిల్లా



ప్రజావాణిలో అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

## సమస్యలను పరిష్కరించాలి

**సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 22: ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అధికారులకు సూచించారు. సోమవారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆమె అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలను నేరుగా విన్నవించి పరిష్కరించుకోవడానికి అర్జీదారులు ప్రజావాణికి వస్తారన్నారు. అందరికీ న్యాయం చేయడం అధికారులుగా తమ కర్తవ్యమన్నారు. ఫిర్యాదులను త్వరగా పరిష్కరించి నివేదిక అందజేయాలని ఆమె అధికారులకు సూచించారు. ప్రజావాణికి మొత్తం 30 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

# ప్రభుత్వ స్కూళ్లలోనే ఉత్తమ బోధన

- సర్కారు బడుల బలోపేతానికి వసతుల కల్పన
- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి
- సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలో పర్యటించిన కలెక్టర్



సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని కేజీబీవీ ఆవరణలో మొక్కనాటి నీరుపోస్తున్న కలెక్టర్ మనుచౌదరి

జగదేవ్‌పూర్, జూలై 22: ప్రభుత్వ స్కూళ్లలోనే ఉత్తమ బోధన ఉంటుందని సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని నిర్మల్‌నగర్, అలిరాజ్‌పేట ప్రాథమిక పాఠశాలలు, జగదేవ్‌పూర్ కేజీబీవీని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కాసేపు పది, ఆరో తరగతి పిల్లలకు గణితం, హిందీ బోధించారు. కేజీబీవీలో వంటగది స్టోర్‌రూమ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మల్‌నగర్ అంగన్‌వాడీ పిల్లలతో కాసేపు ముచ్చటించారు. అనంతరం మండల అధికారులతో కలిసి జగదేవ్‌పూర్ కేజీబీవీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నామన్నారు. పిల్లలను ప్రైవేట్ బడులకు పంపకుండా సర్కారు బడుల్లోనే చదివేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అలిరాజ్‌పేట, నిర్మల్‌నగర్ పాఠశాలలకు ఉపాధ్యాయులను పంపించాలని ఎంఈవోకి సూచించారు. కేజీబీవీకి ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలుపగా సర్వేయర్‌తో కొలతలు వేయించి వెంటనే నిర్మించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ కృష్ణమోహన్, ఎంపీడీవో యాదగిరి, ఎంఈవో ఉదయభాస్కర్ రెడ్డి, ఎంపీవో శ్రీనివాసవర్మ, జగదేవ్‌పూర్ కార్యదర్శి హరిప్రసాద్, కేజీబీవీ ఎస్‌వో ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు పూర్తిచేయాలి

**ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ రాఘవరెడ్డి**



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

నంగునూరు, జూలై 22 : ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను ఆయిల్‌ఫెడ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్యాధునిక టెక్నాలజీ, అన్ని వసతులతో ఫ్యాక్టరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. నూనె ఉత్పత్తి చేయడమే కాకుండా.. రిఫైనరీని పెట్టి ఫైనల్ ప్రాడక్ట్‌ను ఇక్కడి నుంచే నేరుగా మార్కెట్‌లోకి పంపించడం జరుగుతుందన్నారు. రైతులు పండించిన ఆయిల్‌పామ్ రవాణాకు సంబంధించిన ఖర్చును ఫ్యాక్టరీయే చెల్లిస్తుందన్నారు. దేశానికి ఏడాదికి కోటి టన్నుల పామాయిల్ అవసరం ఉందని కానీ 3 లక్షల టన్నులే అందుబాటులో ఉందన్నారు. ఆయిల్‌పామ్ మెట్రిక్ టన్నుకు రూ.18 వేలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ద్వారా రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కేంద్రంపై ఒత్తిడి పెంచేలా అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామన్నారు. కేంద్రం ఇటీవల దిగుమతి సుంకాన్ని తగ్గించడంతో విదేశాల నుంచి మన దేశానికి పెద్ద మొత్తంలో ఆయిల్‌పామ్ దిగుమతి అవుతుందన్నారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా వేరుశనగ, పత్తి, కోకో, నాటుకోళ్ల పెంపకం చేపట్టి అధిక ఆదాయం పొందాలని రైతులకు ఆయన సూచించారు.

## సింగూరుకు వరద



సింగూరు ప్రాజెక్టు

పుల్కల్, జూలై 22 : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు వరద వచ్చి చేరుతున్నది. జూలై చివరలో లేదా ఆగస్టులో కర్ణాటక, సాయిగావ్, పరిసర ప్రాంతాల్లో అధిక వర్షాలు కురిస్తే సింగూరు ప్రాజెక్టులోకి వరద ఉధృతి పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లేదంటే తాగు నీటికి ఎలాంటి సమస్య లేకపోయినా సాగు నీటికి మాత్రం ఇబ్బందులు ఏర్పడే పరిస్థితులు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 29.917 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం ప్రాజెక్టులో 13.702 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 1270 క్యూసెక్కులు కొనసాగుతుండగా,అవుట్‌ఫ్లో 391 క్యూసెక్కులు దిగువకు వెళ్తున్నట్లు ఏఈ మహిపాల్ రెడ్డి వెల్లడించారు.

## పొంగిపొర్లుతున్న కూడవెల్లి వాగు



సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో చ ందాపూర్ వద్ద పొంగిపొర్లుతున్న కూడవెల్లి వాగు

తొగుట జూలై 22: సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో ప్రవహిస్తున్న కూడవెల్లి వాగు పొంగిపొర్లుతున్నది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులోకి భారీగా నీరు చేరి ప్రవాహం పెరిగింది. తొగుట మండలం చందాపూర్ వద్ద కూడవెల్లి వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ నుంచి ప్రవహిస్తున్నది. కూడవెల్లి వాగు ప్రవహిస్తుండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మాజీ సర్పంచ్ బొడ్డు నరసింహులు కోరారు.

## జర్నలిస్టు రంగాచారికి విశిష్ట పురస్కారం

సిద్దిపేట టౌన్, జూలై 22 : సిద్దిపేటకు చెందిన సీనియర్ జర్నలిస్టు, సంఘం జిల్లా నేత కలకుంట్ల రంగాచారి వివిధ రంగాల్లో చేసిన సేవలను గుర్తించి విశిష్ట వ్యక్తి పురస్కారం వరించింది. తెలంగాణ రాష్ట్ర శ్రీవైష్ణవ సేవా సమితి రజతోత్సవాన్ని హైదరాబాద్ బీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న వారికి విశిష్ట వ్యక్తి పురస్కారాలకు ఎంపిక చేసింది. అందులో భాగంగా సిద్దిపేటకు చెందిన జర్నలిస్టు రంగాచారి 30 ఏండ్లుగా ప్రజా సమస్యలపై అనేక కథనాలను రాసి వాటి పరిష్కారానికి కృషి చేశారు. త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి చేతుల మీదుగా విశిష్ట వ్యక్తి పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాజీ అధ్యక్షుడు రమణాచారి తదితరులు పాల్గొన్నారు.



విశిష్ట వ్యక్తి పురస్కారం అందుకుంటున్న సీనియర్ జర్నలిస్టు రంగాచారి



## హరితహారం చెట్లపై గొడ్డలివేటు

- అధికారుల తీరుపై మండిపడుతున్న ప్రజలు
- విద్యుత్ తీగల కింద లేకున్నా చెట్లు నరికివేశారని సిద్దిపేట జిల్లా సిద్దన్నపేట గ్రామస్తుల ఆరోపణ

నంగునూరు, జూలై 22 : నిన్నటి వరకు ఆహ్లాదాన్ని పంచిన వృక్షాలు నేడు మోడుగా మారి దర్శనమిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్దన్నపేట స్టేజీ నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డులో హరితహారంలో భాగంగా విరివిగా మొక్కలు నాటి సంరక్షించగా నేడు అవి వృక్షాలుగా మారాయి. సోమవారం విద్యుత్‌శాఖ అధికారులు ఆ వృక్షాలను నరికివేశారు. విద్యుత్ లైన్ల కింద లేని చెట్లను సైతం నరికివేయడం విడ్డూరం. సిద్దన్నపేట గ్రామానికి గతంలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు సైతం లభించింది. హరితహారం చెట్లను ఇష్టమొచ్చినట్లు నరికివేయడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. మండలానికి సంబంధించిన ఎంపీడీవో, ఇతర అధికారులు ఎవరూ స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు.



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్దన్నపేటలో హరితహారం చెట్లను నరికివేసిన విద్యుత్ అధికారులు